కాలమ్ దాటని కథ

# లోకం తీరు

"నమస్కారం వెంకటసుబ్బయ్య గారూ! చాన్నాళ్ళకి కనిపించారు" బజార్లో ఎదురుపడ్డ వెంకట సుబ్బయ్యను పరామర్శించాడు పరంధామయ్య.

"నమస్తే... నమస్తే...! ఎలా సాగుతోంది మీ వ్యాపారం?" ప్రశ్నించాడు వెంకటసుబ్బయ్య.

"ఏదో మీ దయవలన బాగానే జరుగుతోంది" సమాధానమిచ్చాడు. ఇద్దరూ బజారు పని చూసుకొని తిరుగుముఖం పట్టారు.

దార్లో పరంధామయ్య చెప్పాడు-

"మీరేమీ అనుకోనంటే చాలా రోజులుగా ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను!"

"మరేం ఫర్వాలేదు! చెప్పండి?!" ప్రశ్నార్థకంగా అడిగాడు వెంకటసుబ్బయ్య.

"మీ అమ్మాయి రోజూ స్కూటర్‌లో ఓ అబ్బాయితో తిరుగుతోంది. వయసొచ్చిన ఆడపిల్ల కదాని మీ చెవిన వేస్తున్నాను! ఋజువు కావాలంటే, ఈ సమయంలో వాళ్ళెక్కడుంటారో నాకు తెలుసు, నాతో



రండి చూపిస్తాను" అంటూ ఓ రెస్టారెంటుకు తీసికెళ్ళాడు.

అక్కడ ఆ అమ్మాయి ఇంకో అబ్బాయితో కలిసి నవ్వుకుంటూ టిఫిన్ చేస్తోంది. అది చూసిన వెంకట సుబ్బయ్య కళ్ళు ఎర్రబడ్డాయి.

పరంధామయ్య వద్ద సెలవు తీసుకొని ఇంటిముఖం పట్టాడు. అప్పటికే ఇంటికొచ్చి ఏదో పని చేసుకొంటోంది వాసంతి!

"అమ్మాయ్, వాసంతీ!" గట్టిగా పిల్చాడు వెంకట సుబ్బయ్య. కంగారుగా హాల్లో కొచ్చిపడింది వాసంతి!

"ఇక మీదట నువ్వు అన్నయ్యతో బాటు స్కూటర్ మీద బయటికెళ్ళడానికి వీల్లేదు! ఎక్కడికైనా వెళ్ళాలనుకుంటే సిటీబస్సులో వెళ్ళంతే!"

తండ్రి ఎందుకలా అంటున్నాడో అర్థంకాని వాసంతి తెల్లబోయింది.

—ఎ.జి.మణి

తలుపు చాటుకు నిలుచుంది. నాగమల్లయ్య ఎదురింట్లో కెళ్ళి అటూ, ఇటూ చూసి తలుపుచాటున వున్న భార్య దగ్గరికి నడిచి దగ్గరికి లాక్కోబోయాడు. పార్వతి తప్పించుకుని గోడకు అత్తుకుపోయింది.

"ఏమి గట్లున్నవ్? మీ తల్లిగారింటి నుంచి ఎవరైన వచ్చిండ్రా?" అని అడిగాడు.

పార్వతి సిగ్గుపడుతూ తల అడ్డంగా ఊపింది.

"మరేంది కథ?"

కొద్దిసేపు మౌనంగా వుండి పార్వతి గుసగుసగా నాగమల్లయ్యతో చెప్పింది. దాంతో భర్తనాగమల్లయ్య అమాంతం పార్వతిని ఎత్తి గిరగిరా తిప్పి నిలబెట్టాడు.

"పొయ్యి మీద ఏముందే పిల్లా?..." అని అంతమ్మ అడిగేసరికి పార్వతి ఆలోచనలోంచి తేరుకుంది.

"ఏం లేదు" అని క్షణం తరువాత జవాబిచ్చింది. తిరిగి ఆలోచనల్లో పడింది. తన అత్త ఊరి నుంచి రాగానే విషయం చెవిన వేయగానే ఎంత సంతోషపడింది? దండోరా వేయించినట్టు వాడవాడ తిరిగి చెప్పింది. చెప్పినవాళ్ళకే తిరిగి చెపుతూ ఎన్ని రోజులు గడిపింది? పని గట్టుకుని బంధువుల ఇళ్ళకెళ్ళి తాను నాయనమ్మను కాబోతున్నానని ఎంత మురిసిపోయింది ఆ రోజుల్లో... ఇరవై రెండేళ్ళ తరువాత తన ఇంట్లో ఓ కొత్త జీవి. పుట్టబోతున్నదని చేదబావి వద్ద, కలుపు చేన్లో చెప్పుకుని మరీ మురిసిపోయింది... అవును మరి ఎన్నో సంవత్సరాల తరువాత ఈ ఇంట్లో పురుటివాసన వేయబోతూ వుంటే, చిన్న పిల్లవాడి కేరింతలు వినబోతూ వుంటే ఎవరికైనా సంతోషం, ఆనందం, గర్వం వుంటుంది కదా? అనుకుంది పార్వతి!

ఒక్కసారి దీర్ఘంగా ఊపిరి వదిలి పార్వతి పొయ్యి దగ్గర్నుంచి లేచి భర్త దగ్గరకొచ్చింది. చేపలను తాకి చూసింది. ఒకటి, రెండు కదిలీ కదలనట్టు కదిలాయి. పట్టుకుంటే జారుతున్నాయి.

ఆలస్యమయినప్పటికీ చేపల కూర వండింది పార్వతి. చేపలకూర వాసన ఆ వాడంతా వ్యాపించింది. రెండిళ్ళ ఆవల వుండే రంగమ్మ వొచ్చి "మీ ఇంట్లో చేపలకూర వండినారే?..." అని అడిగి కొంత తీసుకెళ్ళింది.

పార్వతి ముగ్గురికి వడ్డించింది. రోజుకన్నా రెండు ముద్దలు ముగ్గురూ ఎక్కువగానే తిన్నారు. తిన్నాక అంతమ్మ వెచ్చగా వుంటుందని పొయ్యి దగ్గరే పడుకుంది. పార్వతి, నాగమల్లయ్య ఎదురింటి నానుకుని వున్న 'అర్ర'లో పడుకున్నారు. ఉన్న ఒక్క 'మెత్త'మీద ఆలుమొగలు తలలుపెట్టి పడుకున్నారు.

నాగమల్లయ్య తన పటేలు ఇంటి గురించి చెపుతూ, పటేలు బిడ్డ అరుంధతమ్మ కనడానికి వచ్చిందని, ఇప్పుడు ఏడో నెలనే అయినప్పటికీ రేపు పట్నం బండిలో తీసుకుపోతున్నారని చెప్పాడు. పార్వతి కళ్ళముందు అరుంధతమ్మ ఆకారం కదిలింది. పొప్పడి పండులా వుండే అరుంధతమ్మ కట్టే చీరలంటే తనకెంతో ఇష్టం...

..................

కోడి కూసింది. చెట్టుమీద పక్షులు సగం నిద్రలోనే కదులుతూ వున్నాయి. ఒకటి రెండు పక్షులు రెక్కలు టపటపలాడిస్తూ కొమ్మలను మార్చుకుంటున్నాయి. దూరంలో ఎవరో ముసలాయన దగ్గుతున్న శబ్దం. అక్కడెక్కడో కుక్క మొరుగుతున్న చప్పుడు. తల్లి పక్కలో మూత్రం పోసుకుని ఏడుస్తున్న పసిపాప గొంతు... పట్నంలో కొలువుకు పోతున్న కరణం పంతులు కొడుకు సైకిల్ గంట చప్పుడు... ఊరావల నుంచి వినిపిస్తోన్న బాలసంత పదం... ఊరావల నక్కల ఊళ... కాపువాడలో నీళ్ళు చేదుతున్న చప్పుడు... కోమటి అంజయ్య ఇంటి తలుపుకు అడ్డు పెట్టి వున్న ఇనుప 'కుందెన' తీసిన చప్పుడు... జీతగాణ్ణి లేపడానికి వచ్చిన నారాయణ పటేలు పిలుపు... క్రమంగా పిట్టల, కాకుల చప్పుడు ఎక్కువవుతోంది. మెల్లిగా ఊరు మేలుకుంటోంది. దూడల, లేగల అరుపులు వినిపిస్తూ వున్నాయి.

అంతమ్మ పొయ్యి దగ్గర్నుంచి లేవలేదు. చలి జ్వరమొచ్చినట్టుగా వుంది. శరీరమంతా వణుకుతోంది. నిండుగా బొంత కప్పుకుని ముదురుకుంది. మనసులో లేవాలని వున్నా లేవడానికి ఓపిక లేదు. శరీరమంతా సూదుల్తో పొడుస్తున్నట్టుగా వుంది. తలను రాయితో గుద్దినట్టుగా వుంది. కళ్ళు ఆవిరావిరిగా వున్నాయి. నాలుక మొద్దుబారినట్టుగా వుంది. కడుపు నిండుగా వుంది. కాళ్ళు, చేతులు కదపడం కూడా ఇష్టమనిపించడం లేదు.

పక్కలోకొచ్చి పడుకున్న కుక్కపిల్లను మాత్రం వెలగొట్టి అలాగే పడుకుంది అంతమ్మ.

అత్త అలికిడి వినిపించడం లేదని పార్వతి పక్కలోంచి లేచింది. భర్త నాగమల్లయ్య అంతకుముందే చెంబు పట్టుకుని బయటకెళ్ళాడు.

పార్వతి తల వెంట్రుకలను విప్పి ఓసారి దులుపుకుని, ముడి వేసుకుంటూ మెల్లిగా పొయ్యింట్లోకి అత్త దగ్గరికి వచ్చింది.

అంతమ్మ కాళ్ళ దగ్గర పడుకున్న కుక్కపిల్ల పార్వతిని చూసి పారిపోయింది. తల నిండుగా కప్పుకున్న బొంతను కొంత తీసి, పార్వతి "అత్తా..." అని పిలిచింది.

అంతమ్మ వణుకుతున్న గొంతుతో

"ఊ.." అని బొంత మరింత నిండుగా కప్పుకుంటూ "నాకు చాతనైతలేదే! చలిజ్వరమొచ్చినట్టుగుంది. పక్కలకేలి లేవ చాతనైతలేదు. నిన్న ఆ బురదల మర్లాడిన నా రెక్కలన్ని పచ్చి పుండ్లయినయ్... నా కాళ్ళు, రెక్కలు కదలనిస్తలేవు. మెల్ల మెల్లగా నువ్వే పని చేసుకో..." అంది.

పార్వతి శింగులను మీదకు చెక్కుకుంటూ

"అట్లయితే అట్లనే కానియ్, కాని, ఎదురింట్లకు పోయి పండుకో!" అంది. ఆ మాటలో పొయ్యి వద్ద ఊడ్చి, శుభ్రం చేయాలన్న భావన ధ్వనించింది.

అంతమ్మ బలవంతంగా కోడలి సాయంతో లేచి, ఎదురింట్లోకెళ్ళి రోటి పక్కన చాపేసుకుని పడుకుంది.

చెంబుతో బయటకెళ్ళిన నాగమల్లయ్య తిరిగివచ్చి, పగ్గాలు తీసుకుని తన పటేలు పొలంలో బురద నాగలి కట్టడానికి బయలుదేరాడు.

పార్వతి వాకిలి ఊడ్చింది. కోళ్ళను వదిలింది.